క్లుప్తంగా

పనిగంటల పెంపు తగదు



నిరసన తెలియజేస్తున్న కార్మికులు

మందస: పని గంటలు పెంచూతూ అసెంబ్లీలో తీర్మానం చేయడం సరైనది కాదని సీఐటీయూ మండల కన్వీనర్ కె.కేశవరావు అన్నారు. ఆర్.కె.పురం పరిధిలోని రైస్ మిల్లుల కార్మికులతో కలిసి పని గంటలు పెంపును వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక త్యాగాలు, పోరాటాలు చేసి కార్మికవర్గం ఎనిమిది గంటల పని దినాలను సాధించుకుంటే ఇప్పుడు కార్పొరేట్ల మేలు కోసం చట్టాలను మార్చేసి కార్మికులను బానిసలుగా మార్చేయాలని చూస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రైస్ మిల్లు కార్మికుల సంఘం నాయకులు బి.వెంకటేశం, జి.లచ్చుమయ్య, ఎస్.లచ్చయ్య, బి.మల్లేస్, హరికృష్ణ ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పలాస: ఎయిడ్స్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైసీబీ ట్రక్కర్స్ ప్రాజెక్టు మేనేజర్ ఎం.మాధవరావు అన్నారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎయిడ్స్‌పై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో వైసీబీ ట్రక్కర్స్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఇంటెన్సిటిఫైడ్ ఐఈసీ కాంపెయిన్ నిర్వహించారు. ప్రాజెక్టు మేనేజరు మాధవరావు, కళాశాల ప్రిన్సిపాల్ కె.నరిసింహమూర్తి, ఎన్ఎస్ఎస్ పీవో కొండల మధుబాబు, తమ్మినాన పాపారావు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన ఉండాలి



వెంకటాచలం

వజ్రపుకొత్తూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం ఈ నెల 22వ తేదీ నుంచి విధిస్తున్న జీఎస్టీపై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలని రాష్ట్ర వినియోగదారుల సంఘ సమాఖ్య వైస్ చైర్మన్ ఎల్.వెంకటాచలం అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. అవగాహనతోనే మోసాలను గుర్తించి నాణ్యమైన వస్తువులను వినియోగదారులు పొందగలరని అన్నారు. మధ్యతరగతి వినియోగదారులు కొనుగోలు చేసే సుమారు 375 రకాల ఉత్పత్తులపై పన్ను తగ్గించినట్లు కేంద్రం ప్రకటించిందన్నారు. దీంతో వినియోగదారులకు కొంత ఊరట లభించడంపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే వంటగది సరుకులు,విద్యార్థులు వినియోగించే వస్తువులు,ఇన్సూరెన్స్‌కి సంబంధించి జీరో పన్ను విధించడంతో వినియోదారులకు ప్రయోజనం కలుగుతుందన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

కంచిలి: విద్యార్థులు నేత్రాలను అశ్రద్ధ చేయవద్దని కంటి వైద్యురాలు డాక్టర్ శీలా తంగరాజన్ అన్నారు. కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జగదీష్ అధ్యక్షతన స్థానిక ఎన్ఎస్ఎస్ యూనిట్, సోంపేటకు చెందిన నేత్ర వైద్యురాలు డాక్టర్ శీలా కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును మంగళవారం నిర్వహించారు. 200 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. నేత్రాల పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ కనబర్చాలని, సమస్యలుంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ పీవో నరసింహ కుమార్ దాస్, అధ్యాపకులు క్రిష్ణచంద్ర పట్నాయక్, జి.వేణుగోపాల్, ఎస్.కోదండరావు ఉన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రసాదరావు

సోంపేట: స్వయంశక్తి సంఘాలకు అందజేస్తున్న రాయితీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం ప్రసాదరావు అన్నారు. సోంపేటలోని వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమైఖ్య, రైతు ఉత్పత్తిదారుల సమైఖ్య సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీనెల సంఘ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య, వ్యవసాయ శాఖల ద్వారా అందజేసే రుణాలు సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీసీలు శ్రీనివాసరావు, గణపతిరావు, పాపారావు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు..
ప్రజలకు తప్పని అగచాట్లు!

- గ్రామీణ రోడ్లను పట్టించుకోని కూటమి సర్కార్
- శిలాఫలకాలకే పరిమితమైన రోడ్డు నిర్మాణాలు



దారుణంగా ఉన్న శిలగాం జగతి-గోవిందపుట్టుగ రోడ్డు



అసంపూర్తిగా విడిచిపెట్టిన కంచిలి మండలం నారాయణపురం రోడ్డు

కవిటి/కంచిలి: గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు. గ్రామాభ్యుదయం ప్రగతికి సోపానం. ఇవి ప్రతీ బహిరంగసభలో నేతలు వల్లిస్తున్న ప్రవచనాలు. కానీ వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని పలు రోడ్లను పరిస్థితి గమనిస్తే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినప్పటికీ ఒక్క రోడ్డుపై కూడా దృష్టిసారించిన పాపానపోలేదు. దీంతో ప్రజలకు రహదారి కష్టాలు తప్పడం లేదు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే రోడ్లను అద్దంలా మెరిసేలా తీర్చిదిద్దుతామని చెప్పిన నాయకులు అధికారం చేపట్టిన తరువాత అధ్వానంగా వదిలేశారు. కొత్త రోడ్ల నిర్మాణం సంగతి పక్కన పెడితే శిథిలమైన రోడ్లకు కూడా కనీసం మరమ్మతులు చేపట్టలేదని ప్రజలు మండిపడుతున్నారు. మూడుసార్లు ఇచ్ఛాపురం నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్ కనీసం రోడ్లను పట్టించుకోవడం లేదు. 2019లో ఎన్నికలకు కొద్దిరోజుల ముందు నాలుగు మండలాల్లో ఏఐఐబీ నిధులతో సిమెంట్, తారురోడ్ల నిర్మాణం పేరుతో శంకుస్థాపన చేసి శిలాఫలకాలు ఏర్పాటు చేశారు. అయితే రోడ్ల నిర్మాణ పనులు ఎక్కడా జరగలేదు. ఆ తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వివిధ మండలాల్లో జెడ్పీ నిధులు వెచ్చించి కొంతమేర మెటల్ వేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టారు. కొన్నిచోట్ల మండలపరిషత్ నిధులతో పనులు చేశారు. ఎమ్మెల్యే అశోక్ శంకుస్థాపన చేసి విడిచిపెట్టిన శిలఫలకాలు మండలానికి 15కు పైగా దిష్టిబొమ్మలా కనిపిస్తున్నాయి తప్పితే పనులు మాత్రం జరగలేదు. ఇటీవల 2014-19 ఆర్థిక సంవత్సరం మధ్య అసంపూర్ణంగా నిలిచిపోయిన పనుల బిల్లులను ఉపాధి హామీ పథకం ద్వారా కూటమి ప్రభుత్వం అందించేందుకు మార్గం సుగమం చేసింది. అదే తరహాలో నియోజకవర్గంలో శిలాఫలకాలు వేసి నిలిచిపోయిన రోడ్ల నిర్మాణం కూడా రీఓపెన్ చేయించి నిధుల కేటాయింపులు జరిగితే మేలు జరుగుతోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రాలలో సైతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న పరిస్థితుల్లో ఆగిపోయిన గ్రామీణ రోడ్లకు నిధుల కేటాయింపు రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద సమస్య కాదు. కవిటి మండలంలో శిలగాం జగతి రోడ్డు నుంచి బెలగాం-లోళ్లపుట్టుగ జంక్షన్‌కు అనుసంధానించే రోడ్డు దారుణమైన స్థితిలో ఉంది. కనీసం ఆ పనికి గతంలో వేసిన శిలాఫలకం ప్రకారం గోవిందపుట్టుగ వరకు వేసినా కొంత న్యాయం జరుగుతుంది.



కవిటి మండలం గోవిందపుట్టుగ వద్ద రోడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యే ఆవిష్కరించి వదిలేసిన శిలాఫలం

గ్రామీణ రోడ్లపై నిర్లక్ష్యం తగదు



కవిటి మండలంలో గ్రామీణ రహదారుల పట్ల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధానంగా బెలగాం నుంచి లోళ్లపుట్టుగ జంక్షన్ వరకు ఉన్న తారురోడ్డు పనులు అసంపూర్ణంగా చేపట్టారు. దాన్ని పూర్తిచేయాలి.

– ధూపాన నేతాజీ, మాజీ సర్పంచ్, ఆర్ బెలగాం

అసంపూర్తిగా నారాయణపురం రోడ్డు



గ్రామీణ రోడ్ల నిర్మాణంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి సత్వరమే వాటిని పూర్తిచేసి ఎన్నికల హామీలను నెరవేర్చాలి. మా పంచాయతీ పరిధి నారాయణపురం వరకు వేసిన రోడ్డు వెంటనే పూర్తిస్థాయిలో పనులు చేసి ప్రజలకు న్యాయం చేయాలి.

–మాదిని రజిని, సర్పంచ్, మండపల్లి, కంచిలి మండలం

అనుమతులు రాకముందే ప్రచార హోరు!

- బాణసంచా విక్రయాలపై వ్యాపారుల అత్యుత్సాహం

వజ్రపుకొత్తూరు: దీపావళి బాణసంచా విక్రయాలకు అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు రానప్పటికీ కొంతమంది వ్యాపారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ హడావుడి చేస్తున్నారు. ఈ పరిస్థితి వజ్రపుకొత్తూరు మండలంలో మరీ ఎక్కువగా ఉంది. కనీసం విక్రయాల కోసం దఖాస్తు చేసుకోలేదు. అలాగే ఇప్పటి వరకు రెవెన్యూ, పోలీసు, అగ్నిమామక శాఖల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. అయినప్పటికీ క్రాకర్స్ అమ్మే స్థలంతో పాటు అక్టోబర్ 18, 19, 20 తేదీల్లో అమలపాడు జంక్షన్, పూండి తదితర ప్రాంతాల్లో విక్రయాలు చేస్తామంటూ అజంతా, గణేష్ కారర్స్ పేరుతో సోషల్ మీడియాలో బ్యానర్స్ చక్కర్లు కొడతుండడంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తమకే అనుమతులు వస్తాయంటూ చెబుతూ కొంతమంది బాణసంచా సామగ్రి నిల్వలకు సైతం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ సంబంధిత ఆశావహులైన వ్యాపారులు దీన్ని లైట్ తీసుకుంటున్నారు. పూండి ప్రాంతంలో గత ఏడాది దీపావళి రోజుల్లో టెక్కలి, వజ్రపుకొత్తూరు మండలాల నుంచి పెద్ద ఎత్తున వ్యాపారం చేసిన వ్యాపారులు ఈసారి నెల రోజులు ముందు నుంచే విక్రయాలకు ఏర్పాట్లు చేసుకోవడం గమనార్హం. ఈ విషయాన్ని వజ్రపుకొత్తూరు ఎస్ఐ బి.నిహార్ వద్ద ప్రస్తావించగా ఇప్పటి వరకు ఎలాంటి దరఖాస్తులు తీసుకోలేదని, ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు.

పీ4 విధానంలో బంగారు కుటుంబాల ఎంపిక



మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

పలాస: పీ4 విధానంలో బంగారు కుటుంబాలను ఎంపిక చేసి వారి అభివృద్ధికి తోడ్పడాలని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పీ4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్‌షిప్) పథకాని అమలు చేస్తోందన్నారు. దీని అమలుకు సంబంధించి ప్రామాణిక ఆపరేషన్ విధానంపై బుధవారం మున్సిపల్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. అందులో భాగంగా ప్రాథమిక ఏర్పాట్లపై మాస్టర్ ట్రైనర్లు, ట్రైనర్ ఆఫ్ ట్రైనర్‌లతో శిక్షణ కార్యక్రమం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం అమలుకు శిక్షణ పొందిన పది మంది గ్రామ సచివాలయ కార్యదర్శులకు పీ4 ప్రామాణిక ఆపరేషన్ విధానంపై మరింత దిశానిర్దేశం చేయనున్నామని చెప్పారు.

ఘనంగా రచయిత దినకర్ జయంతి వేడుకలు



దినకర్ రచనల ఫ్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కంచిలి: జ్ఞానపీఠ్, పద్మభూషన్ అవార్డుల గ్రహీత, కవి, రచయిత డాక్టర్ రాందారి సింహ దినకర్ జయంతి వేడుకలను బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పదో తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రచనలను ప్లకార్డుల ద్వారా ఒక్కో విద్యార్థి ప్రదర్శించారు. హిందీ ఉపాధ్యాయుడు నిరంజన్ ఖడంగా పాల్గొన్నారు.

ముళ్లపొదలు తొలగింపు



పారిశుద్ధ్య పనుల్లో యువకులు

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టి పంచాయతీ జగన్నాథపురంలో స్థానిక యువకులు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. గ్రామంలో పేరుకు పోయిన ముళ్ల పొదలతోపాటు కాలువల్లో చెత్తా చెదారాలను తొలగించారు.

దుర్గమ్మ తల్లీ..కాపాడమ్మా..



ఇచ్ఛాపురం:స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తజనం



ఇచ్ఛాపురం: బ్రహ్మచారిణిగా స్వేచ్ఛావతి అమ్మవారు



ఇచ్ఛాపురం: దక్షిణ కాళీమాత అమ్మవారి ఆలయంలో బాలాత్రిపురసుందరిగా కాళీమాత



ఇచ్ఛాపురం రూరల్: గాయత్రి అవతారంలో తిప్పనపుట్టుగ ముత్యాలమ్మ అమ్మవారు



సోంపేట: గాయత్రిదేవిగా సోమపోలమాంబదేవి



సోంపేట: సీతారాంపేటలో ఆకట్టుకుంటున్న ఉత్సవ మండపం



కవిటి: గాయత్రిమాతగా దర్శనమిచ్చిన గొంద్యాల పుట్టుగ భూలోకమాత అమ్మవారు

దుర్గాదేవి నవరాత్రి వేడుకలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. రెండోరోజైన మంగళవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. దుర్గమ్మ తల్లీ కాపాడమ్మా అని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పలుచోట్ల భక్తులకు అన్నప్రసాదాన్ని కమిటీ సభ్యులు వితరణ చేశారు.

–సాక్షి నెట్‌వర్క్

ఆర్థిక సాయం



వజ్రపుకొత్తూరు మండలం పాత టెక్కలి గ్రామానికి చెందిన మణిగాం విశ్వనాథం పక్షవాతంతో బాధపడుతున్నారు. చికిత్స కోసం రూ. మూడు లక్షలు ఖర్చు చేసి అప్పులపాలయ్యారు. గ్రామంలో చెత్త బండి నడుపుతూ ఉపాధి పొందుతున్న అతని గురించి తెలుసుకున్న ఉద్దానం అభ్యుదయ సేవా సమితి సభ్యులు తమవంతుగా పది వేల రూపాయలను బాధితుడుకి మంగళవారం అందజేసి అండగా నిలిచారు. మరికొంతమంది సాయం అందించి నిరుపేదకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్దానం అభ్యుదయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తామాడ లక్ష్మణరావు, ప్రతినిధులు మండల మహేష్, నీలయ్య, కర్ని వెంకటరమణమూర్తి, తుంగాన ధర్మారావు, డి.పవన్‌కుమార్, సంతోష్, మహేష్, బాబూరావు, శంకర్, చందు, రాణి ఉన్నారు.

–వజ్రపుకొత్తూరు

రక్తం సేకరణ



ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 15 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. శ్రీకాకుళం రిమ్స్ సహకారంతో ఎన్ఎస్ఎస్ పీవో సంతోష్ ఆధ్వర్యంలో వలంటీర్లు రక్తదానం చేశారు. వైద్యురాలు ఎం.సామిలి, రిమ్స్ సిబ్బంది తాతారావు, కళాశాల అధ్యాపక బృందం దుర్యోధన, శివకుమార్, గాయత్రి, యువరాజ్, వసంత్, అక్షయ్, భాస్కరరావు, సుజాత, అవినాష్, అమిత్ ఉన్నారు.

– ఇచ్ఛాపురం

ఉపాధ్యాయుడికి సత్కారం



కంచిలి మండలం గొల్లపుట్టుగ గ్రామానికి చెందిన హిందీ ఉపాధ్యాయుడు బంగారు ఆనంద్‌ను హిందీ వికాస వేదిక భాషా 11వ రోజు కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఆనంద్ ఇటీవల డీఎస్సీలో ఉద్యోగం పొందారు. నాన్‌లోకల్ అభ్యర్థిగా దరఖాస్తు చేసి పరీక్ష రాసి కర్నూలు జిల్లా టాపర్‌గా నిలిచారు. దీంతో ఆయనను హిందీ ప్రచారక్ నిరంజన్ ఖడంగా చేతులమీదుగా ఉపాధ్యాయుడు మురపాల జగన్ తదితర గ్రామస్తుల సమక్షంలో సత్కరించి గౌరవించారు.

–కంచిలి

ప్రారంభమైన భవన నిర్మాణ పనులు

సాక్షి ఎఫెక్ట్...



పనులను పరిశీలిస్తున్న అధికారులు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో ఉపాధిహామీ, మండల మహిళా సమాఖ్య ఉద్యోగులకు కలిపి ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ సేవా కేంద్ర భవనం నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఈ విషయమై ఈ నెల నాలుగో తేదీన ‘పరాయి పంచన ఉపాధి కార్యాలయం!’ అనే శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించారు. ఈ అసంపూర్తి భవన నిర్మాణాన్ని పూర్తిచేయడానికి చర్యలు చేపట్టారు. రూ. 15 లక్షలు నిధులు మంజూరు చేసి రెండు రోజుల క్రితం పనులు ప్రారంభించారు. వీటిని ఎంపీడీవో వి.తిరుమలరావు, మండల ఇంజినీరింగ్ అధికారి పి.ప్రవీణ్, ఏపీవో జి.ధనుంజయ పర్యవేక్షిస్తున్నారు.

అలరించిన వేషధారణ



చిన్న ఎర్రగోవిందపుట్టుగలో చిన్నారుల వేషధారణ

కవిటి: దుర్గాశరన్నవరాత్రుల వైభవాన్ని వివరించేలా చిన్న ఎర్రగోవిందపుట్టుగకు చెందిన చిన్నారులు ప్రదర్శించిన వేషధారణ అలరించింది. దుర్గామాత, మహిషాసురమర్దిని అవతారఘట్టాన్ని అద్భుతంగా ప్రదర్శించి పలువురు ప్రశంసలు అందుకున్నారు.

ఉత్సవ సందడి..



విద్యుత్ దీపాలంకరణలో కొత్తమ్మతల్లి ఆలయం



మహిళల కోలాట ప్రదర్శన

కోటబొమ్మాళిలోని కొత్తమ్మతల్లి ఉత్సవం మంగళవారం ఉత్సాహంగా ఆరంభమైంది. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. సాంస్కృతిక ప్రదర్శనతో కోటబొమ్మాళి ఉత్సవ శోభను సంతరించుకుంది. భక్తులకు ఇబ్బంది లేకుండా పోలీసులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

వినూత్నంగా ఆలోచన చేయాలి

ఇచ్ఛాపురం: మనం పారేసే వ్యర్థాలను కూడా వినూత్నంగా ఆలోచించి వాటిని వినియోగించే వస్తువులుగా మలుచుకోవచ్చునని ఇచ్ఛాపురం మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ అన్నారు. స్థానిక సీబీఎస్సీఈ పాఠశాల ఆవరణలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వేస్ట్ టూ ఆర్ట్ గ్యాలరీని పాఠశాల సీఈవో జోహార్ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసారు.